ప్రజాశక్తి
ఆదివారం 27 ఆగస్టు 2023
5
విజయనగరం

బస్టాండ్లలో ఖాళీ స్థలాలు 15 ఏళ్లు లీజుకు

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లాలోని బొబ్బిలి, కొత్తవలస ఆర్‌టిసి బస్టాండ్లలో ఖాళీ స్థలాలను దీర్ఘకాలిక ప్రాతిపదికన 15ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని ఆర్‌టిసి నిర్ణయించింది. ఈమేరకు విజయనగరం ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆర్‌ఎం సిహెచ్ అప్పలనారాయణ శనివారం సమావేశం నిర్వహించారు. డిపో మేనేజరు జె. శ్రీనివాసరావు , డిఇ శ్రీనివాసరావు, వ్యాపారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఆర్టీసి కాంప్లెక్సులోని షాపులను ఏడాదికో, రెండేళ్లకో వేలం పాట ద్వారా అద్దెకు ఇచ్చేవారు. తాజా నిబంధనల మేరకు బస్టాండ్ ఆవరణల్లోని స్థలాలను 15ఏళ్ల పాటు లీజుకు వ్యాపారాల నిమిత్తం ఇస్తున్నట్లు ఆర్‌ఎం తెలిపారు.

'దొర'కని భరోసా?

మరడాం సభలో సిఎం ప్రసంగిస్తుండగా పక్కనే నిలబడిన రాజన్నదొర

- నాడు రాజన్నదొర నీతిమంతుడని జగన్ ప్రశంసలు
- నేడు గిరిజన వర్సిటీ సభలో రాజన్న ఊసెత్తని సిఎం
- డిప్యూటీ సిఎం భవితపై నీలినీడలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పట్టణ నడిబొడ్డున నిర్వహించిన బహిరంగ సభకి, శుక్రవారం దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో జరిగిన గిరిజన యూనివర్సిటీ బహిరంగ సభకీ స్పష్టమైన తేడా కనిపించింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర విషయంలో వైసిపి అధినేత, సిఎం జగన్ మోహన్ రెడ్డి మాటతీరులో అంత స్పష్టమైన తేడా కనిపించడానికి కారణాలేమిటనే చర్చ మొదలైంది.

ప్రజాశక్తి-సాలూరు

2019లో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా పట్టణానికి వచ్చిన వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. పట్టణ నడిబొడ్డున నిర్వహించిన బహిరంగ సభలో అప్పటి ఎమ్మెల్యే రాజన్నదొరను పక్కన నిలబెట్టుకున్న జగన్ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. గిరిజనుడైన రాజన్నదొర నీతిమంతుడని, రూ.30 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చినా పార్టీ ఫిరాయించలేదని కితాబిచ్చారు. పార్టీ ఫిరాయించిన బొబ్బిలి రాజు కన్నా దొర నిజాయతీపరుడని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా రాజన్నదొరను గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాంటి ప్రశంసలందించిన జగన్.. శుక్రవారం దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో నిర్వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో ఆయన గురించి కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదు. నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క వరం కూడా ప్రకటించలేదు. సిఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన సమయంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర పక్కనే నిలబడ్డారు. జగన్ 35 నిమిషాల ప్రసంగంలో దొర గురించి ప్రస్తావించకపోవడం సరికొత్త చర్చకు తెరలేపింది. మరో ఆరు నెలల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో సిఎం జగన్ డిప్యూటీ సిఎంగా రాజన్నదొర పనితీరు గురించి పల్లెత్తు మాట అనలేదు. 2024లో జరిగే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మళ్లీ రాజన్నదొరని ఆశీర్వదించాలని చెప్పకపోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల వైసిపి సోషల్ మీడియా గ్రూపుల్లో రాష్ట్రంలో దాదాపు 79 నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితా హల్‌చల్ చేసింది. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులందరూ 90 శాతం గెలుపు గుర్రాలేనన్న వాదనలు వినిపించాయి. ప్రస్తుత నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం నిశితంగా పరిశీలిస్తే రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. అలాగైతే వైసిపి సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చిన తొలి విడత జాబితాలో రాజన్నదొరకూ చోటుదక్కాలి. కానీ అందులో దొరకు చోటుదక్కలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి పేర్లు ఆ జాబితాలో కనిపిస్తున్నాయి. తొలివిడత జాబితాలో చోటు దక్కకపోవడం, నిన్న మొన్నటి సిఎం జగన్ సభలో దొర ప్రస్తావన లేకపోవడం వంటి పరిణామాలు రాజన్నదొర భవితవ్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి.

సర్వేల్లో ప్రతికూల పవనాలే కారణమా?

వైసిపి అధిష్టానం సొంతంగా కొన్ని మీడియా సంస్థలతో రానున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై రహస్యంగా సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సర్వేల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయనే వాదనలు గుప్పుమన్నాయి. రోజూ స్థానికంగా ఉన్నప్పుడు ఉదయం 11 గంటల తర్వాతే ప్రజలకు అందుబాటులో ఉంటారని, నియోజకవర్గ పార్టీపై నియంత్రణ లేకపోవడం, మండలాలు, పట్టణంలో నాయకుల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలను చక్కదిద్దడంలో వైఫల్యం, డిప్యూటీ సిఎం, మంత్రి హోదాలో జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే రీతిలో వ్యవహరించకపోవడం, పూర్తిగా ఉమ్మడి జిల్లా అగ్రనేత కనుసన్నల్లో పని చేస్తుండడం వంటి అంశాలు పార్టీ అంతర్గత సర్వేల్లో ప్రతికూలతకు కారణాలనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ప్రధానంగా మున్సిపాలిటీలో పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ ముదిరి పాకాన పడుతున్న తీరు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారడం కూడా దొర నాయకత్వంపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది.

పుష్పశ్రీవాణికి ఆశీస్సులు

ఇటీవల కాలంలో కురుపాం నియోజకవర్గంలో సిఎం జగన్ పర్యటించారు. అక్కడ నిర్వహించిన సభలో సిఎం జగన్ మాజీ మంత్రి పుష్పశ్రీవాణి గురించి ప్రస్తావిస్తూ ఆశీస్సులు అందించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పుష్పశ్రీవాణిని మళ్లీ గెలిపించాలని జగన్ కోరారు. కానీ సాలూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో మాత్రం రాజన్నదొర ఊసెత్తని పరిస్థితి కనిపించింది. అధికారపార్టీలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో రానున్న ఎన్నికలు సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టవచ్చునని పలువురు భావిస్తున్నారు.

ఎమ్‌పిపై దొరకు ఆశలు

అరకు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర గత ఎన్నికల నుంచి ఆశిస్తున్నారు. అయితే గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని దొరపై ఒత్తిడి చేశారు. దీంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రానున్న ఎన్నికల్లోనూ వైసిపి ఎమ్‌పి సీటు కావాలనే కోరికని ఆయన కొంతమంది ముఖ్య నేతల వద్ద వ్యక్తం చేశారని సమాచారం. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొర అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలపై కొంత అసంతృప్తితోనూ ఉన్నారు. గ్రూపు రాజకీయాలపై విసుగుతో ఎమ్‌పి అయితే కొంత ప్రశాంతత ఉంటుందని ఆయన యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధిష్టానం ఆయన సీనియారిటీని ఏవిధంగా వినియోగించుకుంటుందో వేచి చూడాలి.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో జగనన్న ఇళ్లు నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ వి. శ్రీనివాసరావు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో హౌసింగ్ అధికార్లు జగనన్న కాలనీ సందర్శించి ఇంటి నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నిర్మాణాలు జరపని అర్హులైన లబ్ధిదార్లు ఇంటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలన్నారు. నిర్మాణాలు ప్రారంభించక పోతే రద్దు జరిగే అవకాశం ఉందన్నారు. కాగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, హౌసింగ్ డిఇ జి.మురళీ మోహన్, నగర పంచాయతి మేనేజర్ టి.కె.వి. విశ్వేశ్వర రావు, హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ నారాయణ లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇంతవరకు పునాదులు తీయన వారి పట్టాలు రద్దు చేసి వేరే వారికి ఇచ్చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, గృహ నిర్మాణ సంస్థ ఎఇ ఆదిలక్ష్మి, గ్రామ సర్పంచ్ బల్లెంకి లక్ష్మి, ఎంపిడిఒ బిఎస్కేఎన్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

బొబ్బిలి : ఈ నెల 30న జరగనున్న సామూహిక గృహ ప్రవేశాలకు జగనన్న ఇళ్లను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. జగనన్న ఇళ్ల నిర్మాణంపై శనివారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న ఐటిఐ కాలనీ లేఅవుట్‌లో జగనన్న ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి ముత్యాలనాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హాజరవుతారని, ఇళ్లకు రంగులు వేసి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఒ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వసతి కల్పనే లక్ష్యం : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సంక్షేమ పథకాలతో పాటు, ప్రతి ఒక్కరికీ గృహ వసతి కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని నగర మేయర్ విజయలక్ష్మి పునరుద్ఘాటించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడ్కోఇళ్ల లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్లను అందజేశారు. అనివార్య కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారులకు డాక్యుమెంట్లను అందించలేక పోవడంతో శనివారం 243 మందికి డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పేదవారి ఇంటికలను నిజం చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలను అందజేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. లబ్ధిదారులకు గహాలు అందజేయడంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సదుపాయాలు కల్పించకుండా లబ్ధిదారులను అయోమయంలో ముంచారని అన్నారు. ఈ విషయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్థానికంగా ప్రత్యేక శ్రద్ధ కనపరచి లబ్ధిదారులకు అనువుగా ఉండే విధంగా అన్ని సౌకర్యాలను మెరుగుపరిచారని చెప్పారు. శ్రావణమాసం నేపథ్యంలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకొని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు బండారు ఆనందరావు, అల్లు చాణక్య, ఆల్తి సత్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారుకు డాక్యుమెంట్లు అందజేస్తున్న మేయర్ వి.విజయలక్ష్మి

108లో గిరిజన మహిళ ప్రసవం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నెలలు నిండిన గిరిజన గర్భిణీని ప్రసవం నిమిత్తం శనివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి 108 వాహనాలో తరలిస్తుండగా మార్గం మధ్యలో వాహనంలోనే ప్రసవించింది. ఈమేరకు 108 పైలెట్ మూర్తి, టెక్నీషియన్ సత్యారావు తెలిపారు. అల్లూరి జిల్లా, అనంతగిరి మండలం గంగవరం గ్రామానికి చెందిన అర్జుపు సుఖరమ్మకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంలో ఎస్‌కోట ఏరియా ఆసుపత్రికి తీసుకొస్తుండగా మండలంలోని రాజంపేట గ్రామ సమీపంలో ఆమె 108 వాహనంలో ప్రసవించింది. గర్భిణికి తీవ్ర నొప్పులు రావడంతో బొడ్డవర దాటిన తరువాత వాహనాన్ని రోడ్ పక్కకు ఆపివేసి సిబ్బంది డెలివరీ చేయించారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పైలట్ మూర్తి, టెక్నీషియన్ సత్యారావులు చాకచక్యంగా డెలివరీ చేసి తల్లీ బిడ్డలను క్షేమంగా ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ ఉదయకుమార్ ప్రథమ చికిత్స అందించి తల్లీ బిడ్డ ఆరోగ్యంగా వున్నారని 108 సిబ్బందిని అభినందించారు.

గిరిజన మహిళకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

గిరి పుత్రులను మభ్యపెట్టిన వైసిపి

టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

గిరి పుత్రులను వైసిపి ప్రభుత్వం మభ్య పెడుతోందని విజయనగరం పార్లమెంట్‌స్థానం టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. శనివారం ఆయన అశోక్‌బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గిరిజన యూనివర్సిటీ నిర్మాణం కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలంలోని రెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని గిరి జన ప్రాంతానికి సమీపమైన అప్పన్నదొరపాలెం వద్ద భూమిని గుర్తించి, స్థల సేకరణ చేసి యూనివర్సిటీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిందని తెలిపారు. ప్రహరీగోడ కూడా నిర్మించిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ నిర్మాణాన్ని పక్కనబెట్టి తీవ్ర కాలయాపన చేసిందన్నారు. శంకస్థాపన చేసిన స్థలాన్ని కాదని మళ్లీ క్రొత్తగా వేరొకచోట శంకుస్థాపన చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. డాక్టర్ పివిజిరాజు పాచిపెంట వద్ద సుమారు 3వేలఎకరాలు భూమిని గిరిజన విశ్వవిద్యాలయం కోసం గతంలో ఇచ్చినప్పటికీ, రవాణా సౌకర్యాలు, విమానాశ్రయం వంటి సదుపాయాలు మెరుగ్గా ఉండే ప్రాంతం కావాలని తెలపడంతో, రెల్లి గ్రామం వద్ద టిడిపి ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. ఏ ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం స్థలం మార్పిడి చేసిందో అర్థం కావడం లేదన్నారు. నాలుగే ళ్లుగా నిర్మాణం చేసి ఉంటే నేడు విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేదని, కానీ ఈ ప్రభుత్వానికి యూనివర్సిటీ నిర్మాణం పట్ల, గిరిజన విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం తప్పా ఈ ప్రభుత్వం చేసిన ఘనకార్యం ఏమీలేదన్నారు. గిరిజనుల పట్ల దొంగ ప్రేమను చూపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తప్పకుండా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరం లోని దాసన్నపేట లోగల బాలికోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రికార్డును పరిశీలించారు. విద్యా బోధన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీ లేదని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ అమలు చెయాల్సిందేనని అన్నారు. ఆయన వెంట ఎంఇఒ రాజు ఉన్నారు.

ఉపాధ్యాయరాలితో మాట్లాడుతున్న డిఇఒ

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విజయనగరం టౌన్ : మదర్ థెరిసా 113వ జయంతి, మదర్ థెరిసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ 6వ వార్షికోత్సవాన్ని అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న మదర్ తెరిసా కిడ్స్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని 50మందిని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్, గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వినియోగంలోకి వ్యాపార సముదాయాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్న, మధ్య తరహా పట్టణాల సమగ్ర అభివృద్ధి వ్యాపార సముదాయ భవనానికి పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింతగా ప్రజా వినియోగంలోకి తీసుకు రానున్నట్లు కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు వెల్లడించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఇటీవల వ్యాపార సముదాయ భవనం దక్షిణ భాగంలో చిన్నపాటి గోడ కూలడంతో వ్యాపారస్తుల అభ్యర్థన మేరకు తక్షణ మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్, ఇతర అధికారులతో కలిసి కమిషనర్ వ్యాపార సముదాయం పై అంతస్తు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్లాబు పనులు పూర్తి స్థాయిలో చేపట్టేందుకు నిర్ణయించారు. అవసరమైన అంచనా వ్యయం సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.నగర నడిబొడ్డులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయం ఏర్పాటు కావడం వల్ల ఎంతోమందికి ప్రయోజనం చేకూరు తుందన్నారు. వ్యాపార సముదాయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి మరింతగా ప్రజలకు చేరువయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. రెవెన్యూ, హెల్త్ కమిటీ సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి ఐడియస్ ఎంటి కాంప్లెక్స్ భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు జరిపే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తద్వారా కమిటీ ఇచ్చిన సూచనలతో భవన సముదాయాన్ని ఆధునీకరిస్తామన్నారు. సమన్వయ కమిటీ నిర్ణయాన్ని కౌన్సిల్ దష్టికి తీసుకురానున్నట్లు చెప్పారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఇఇ కె. శ్రీనివాసరావు, డిఇ పాల్గొన్నారు.

మాకు మీరు...మీకు మేము

ప్రజాశక్తి - విజయగరం ప్రతినిధి

జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు 'మాకు మీరు... మీకు మేము' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాధనాన్ని, భూములను కారు చౌకగాను, ఒకింత సులభతరంగానూ చేజిక్కించు కునేందుకు అంతా ఒక్కటౌతున్నారు.' ఇదేదో వేరొక రాజకీయ పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న విమర్శలు కాదు సుమా...! నాయకుల వ్యవహారశైలి పై పెల్లుబుకుతున్న పబ్లిక్ టాక్. ఇందుకు ఎన్నో సందర్భాలను, రాజకీయ విన్యాసాలను ఉదాహరణగా చెప్పుకుంటున్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో రూ.కోట్లు విలువ చేసే 30ఎకరాల భూమిని పరిశ్రమ పేరిట జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబీకుల పేరున రూ.10లక్షలకే కట్టబెట్టినట్టు వార్తలు వచ్చిన విషయం విధితమే. దీనిపై ప్రతిపక్షం స్పందించే తీరుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. మొదటి రెండు రోజులపాటు టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున, టిడిపి బొబ్బిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బేబినాయన కొంత హడావుడి చేసినప్పటికీ ఆ తరువాత మిన్నకుండిపోయారు. విమర్శలు మనహా మంత్రి కుటుంబీకులకు భూమి కేటాయింపుపై నిఖరమైన పోరాటం చేయలేదు. వీరి సంగతి కాసేపు పక్కనబెడితే.. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా, టిడిపిలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట వరసకు కూడా స్పందించలేదు. దీంతో, అశోక్ తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి మాన్సాస్‌లో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, వేల కోట్ల విలువ చేసే భూములు, భవనాలు, స్థలాలు, 13 విద్యాసంస్థలు ఉన్న ఆ ట్రస్ట్‌లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నట్టు లెక్కలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాన్సాస్ ట్రస్ట్ లెక్క తేలుస్తామంటూ వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్త మంత్రి బొత్స హడావుడి చేసినప్పటికీ ఆ తరువాత మిన్నకుండి పోయారు. విజయసాయిరెడ్డి జరిపిన ఫ్లోరెన్సిక్ ఆడిట్ రిపోర్టు కూడా బుట్టదాఖలైపోయింది. ఈ నేపథ్యంలో బొత్సపై అశోక్ అప్పుడప్పుడూ విమర్శలు చేస్తున్నప్పటికీ ఉదారతగానే వ్యవహిస్తారని చాలా మంది నోట వినిపిస్తున్నమాట. గతంలో సీతం కళాశాల స్థలంపై సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున పోరాటం జరిగినప్పటికీ అశోక్ స్పందించలేదు. ఇంకోవైపు పార్టీలో అశోక్‌కు తానేమీ తీసిపోను అన్నట్టుగా వ్యవహరిస్తున్న కిమిడి కళావెంకటరావు కూడా బొత్సపై వచ్చిన ఆరోపణలపై స్పందించలేదు.అందరూ అంటున్నట్లుగా ఆయన కుమారుడిపేరున అప్పటి టిడిపి ప్రభుత్వం 10ఎకరాలు కట్టబెట్టిన తీరువల్లేనేమో అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు చేసిన ప్రకటనపైనా కళావెంకటరావునుంచి స్పందన లేదు. మరోవైపు ఎస్.కోట నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయంటూ సుమారు నెల రోజుల క్రితం అదే ప్రాంతంలోవుంటున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రకటించారు. త్వరలో అందరి బాగోతం బయటపెడతానని కూడా హెచ్చరించారు. రోజులు నెలలు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ భాగోతమేదో బయటపెట్టక పోవడంతో లోలోపల ఏదో సెట్టింగులు జరిగిపోతున్నాయంటూ చర్చమొదలైంది. ఇలా ప్రభుత్వ లోపాలను, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులపై టిడిపి నాయకులు స్పందించడం లేదని, అటు టిడిపి నాయకులపై రాజకీయ ఆరోపణలు తప్ప గతంలో చేసిన, జరిగిన అక్రమాలపై వైసిపి నాయకులు కూడా నోరు మెదపడం లేదని జిల్లాలో చర్చ నడుస్తోంది.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక బాధ్యతగా పలు సంస్థలు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, వైసిపి యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర కౌశిక్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జెసిఐ విశాఖ జోన్, నెస్టీ సౌజన్యంతో శనివారం రింగురోడ్డులో 450 మంది పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడుతూ ఈ సంస్థ వారు ఏటా సి.ఎస్.ఆర్ యాక్టివిటీ కింద సుమారు రూ.1.50 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నారని చెప్పారు. శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి సూచనల మేరకు ప్రస్తుతం ఇక్కడ పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. జెసిఐ విశాఖ జోన్ ప్రెసిడెంట్ అమరేష్ మాట్లాడుతూ సుమారు 450 మందికి ఒక్కొక్కటీ రూ.1200 విలువ గల నిత్యావసర సరకుల కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో జేసీఐ, నెస్టీ సంస్థల ప్రతినిధులు హర్షవర్ధన్, మతివన్నన్, శ్రావణ్ కుమార్ సింగ్, రామ సూర్యన్, వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, సుజాత పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ఎన్‌ఆర్‌ఐ కాలేజీ విద్యార్థులతో వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు శనివారం సమావేశమయ్యారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసే మత్తు, మాదక ద్రవ్యాలు దూరంగా ఉండాలని విద్యార్థులను కోరారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తులు వాటి నుండి బయట పడలేక, విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతూ, భవిష్యత్తు నాశనం చేసుకొంటూ, తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారని అన్నారు. ఇటువంటి వాటికి దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు, ఎన్‌ఆర్‌ఐ కాలేజి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న డైరెక్టర్ సీతారామరాజు, తదితరులు

ఎంవిజిఆర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- డెంకాడ

మహారాజ్ అలక్ నారాయణ్ గజపతిరాజు 121వ జయంతిని పురస్కరించుకుని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎంవిజీఆర్ డైరెక్టర్ పిఎస్ సీతారామరాజు, ఎంవిజీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎంసి శేఖర్, డీన్స్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అలక్ నారాయణ్ గజపతి రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందిని ఉద్దేశించి డైరెక్టర్ సీతారామరాజు మాట్లాడుతూ మహారాజ్ అలక్ నారాయణ్ గొప్పతనాన్ని కొనియాడారు. ఆయన కుమారుడు డాక్టర్ పివిజి రాజు, విజయనగరం రాజా సాహెబ్, ఆధ్వర్యంలో మాన్సాస్ ట్రస్టును స్థాపించారని గుర్తుచేసుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్, న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ విజయనగరం సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని 60 యూనిట్ల రక్తదానం చేసి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, హెచ్ఒడిలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.షణ్ముఖరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం

ప్రజాశక్తి - కొత్తవలస

నేత్ర దానం మహా ప్రధానమని, నేత్రదానం చేసి మరొకరికి చూపునివ్వాలని వియ్యంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి. జయశ్రీ, డాక్టర్ సింహాద్రి నాయుడు అన్నారు. పాఠశాల ఆవరణలో 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నేత్ర దానం మహా దానం అని, నేత్ర దానం చేయండి -ఇద్దరు అంధులకు చూపునివ్వండి, సర్వేంద్రియనామ్ నయనం ప్రధానం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పిల్లలకి దృష్టి లోపం ఉంటే తనిఖీ చేసుకొని అవసరమైన వారికి వైఎస్ఆర్ కంటి కార్యక్రమంలో ఉచితంగా కళ్లద్దాలు ఇస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ టి. జయశ్రీ మాట్లాడుతూ పిల్లలకి దృష్టి లోపం రాకుండా ఉండాలంటే ఆకుకూరలు, కేరేట్, బొప్పాయి, మామిడి, బీట్ రూట్ వంటివి తినాలని, మంచి నిద్ర, వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం పిల్లలకి నేత్రదానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ సి.హెచ్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరావు, స్టాఫ్ నర్స్ దీప, ఉపాధ్యాయులు, ఎఎన్ఎమ్ భవాని, ఆశ వర్కర్ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం భేష్

ప్రజాశక్తి - వంగర

మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం బేస్‌గా ఉందని మండల విద్యాశాఖాధికారి వై దుర్గారావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఆ పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాడు నేడు పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి గణపతి పాల్గొన్నారు.

వంగర సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వంగర

స్థానిక సచివాలయాన్ని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ వృద్ధాప్య, వికలాంగులు ఒంటరి మహిళ పెన్షన్లు, హౌసింగ్ చేయూత తదితర వాటికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో శనివారం మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జెకెసిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాల్లో తక్కువ బరువున్న చిన్నారులకు, గర్భిణులకు తగిన పోషకాహారం అందేటట్టు చూడమని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. రెవెన్యూ పరిధిలో ఉన్న సమస్యలపై సమీక్షించారు. వివిధ శాఖలకు సంబంధించి సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మి నాయుడుకు బేబినాయన నివాళి

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారాపు తమ్మి నాయుడు అనారోగ్యంతో అకాల మరణం చెందిన విషయం తెలుసుకొని టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇంఛార్జి బేబీ నాయన శనివారం లోచర్ల గ్రామానికి చేరుకొని పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు ఎన్ వెంకటేశ్వరరావు, వెంకట్ నాయుడు తదితరులు ఉన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిసి సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

- డెంకాడ

సంకిలిలో చాలీచాలని తాగునీరు

● ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ● పూర్తిస్థాయి మంచినీటి పథకం లేక అవస్థలు ●ఒక వీధికి తాగునీరు వస్తే, ఇంకో వీధిలో కొరతే

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో చాలీచాలని తాగునీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 1200 గడప ఉన్నప్పటికీ జనాభా ప్రాప్తికి 2,000 మంది ఉన్నారు. సరైన తాగునీటి పథకం లేక నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఒక వీధిలో తాగునీరు వదిలితే, మరో వీధి వారు వస్తే నీటి కోసం ఘర్షణలు తప్పడం లేదు. బొడ్డవలస వద్ద ఉన్న పైలేట్ ప్రాజెక్ట్ నుంచి తాగునీరు వస్తున్నప్పటికీ అనుకున్న విధంగా పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు లేక తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజువారి ఉదయం పూట సరఫరా కావటం తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. సంకిలి గ్రామపంచాయతీ పరిధి నాగావళి నది నుంచి రాజాం, వంగర, సంతకవిటి, చీపురుపల్లి, జి సిగడాం ఇతర మండలాలకు తాగునీరు వెళుతుంటే సంకిలి గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సమస్య ఉన్నప్పటికీ నాడు సమస్య మరింత జఠిలమైందని వాపోతున్నారు. ప్రతి ఇంటికి కులాయి అన్న పేరుతో జల జీవన్ పథకం ఈ గ్రామానికి ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడం తాగునీటి సమస్య ఏర్పడిందని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి కోసం కుళాయి వద్ద గుమిగూడిన మహిళలు

తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి

సంకిలి గ్రామానికి తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. ఇక్కడ కొండ ప్రాంతం కాబట్టి దిగువ భాగాలకు తాగునీరు వెళ్లాలంటే రెండు ట్యాంకుల అవసరం. జల జీవన్ పథకం మంజూరు అయ్యింది. టెండర్లు పిలిచినప్పటికీ గుత్తేదారులు హాజరు కావడం లేదు. అందుకు లేటు అవుతుంది. తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

జి. శ్రీచరణ్, జెఇ ఆర్‌డబ్ల్యుఎస్, రేగిడి

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తెర్లాం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మండలంలోని అంట్లవారా లింగాపురం గ్రామాల్లో శనివారం రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి మళ్లీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి వైసిపి మండల అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర పంచాయతీ లచ్చన్న దొరపాలెం గ్రామానికి చెందిన కోదండరామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా జరిగింది. సేవాసంఘం సహకారం, తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10లక్షల ఆర్థిక సహాయం, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోదండరామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం 6గంటల నుంచే నిత్యఅర్చన, విగ్రహ యుంత్రం పూజ, హెూమం, అభిషేకాలు, రత్నన్యాసం పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సీతారాముల విగ్రహ ప్రతిష్ట శిఖర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపిపి పి.వెంకటరమణ, గ్రామ సర్పంచ్ దేవాపురపు మీనా, గ్రామ పెద్దలు టి.సాంభరాజు, వైసిపి నాయకులు బి. మురళీ మోహన్ రాజు, దేవాపురపు దేముడు, వెంకటరావు, బుగత వెంకటేశ్వరరావుతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి సీతా రాముల స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు ముషిడిపల్లి మహిళా ట్రూప్ ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శ్మశానాన్ని అభివృద్ధి చేయండి

బొబ్బిలి: మల్లమ్మపేట శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మేనేజర్ శివప్రసాద్‌కు కౌన్సిలర్ కొర్లాపు రామారావు, కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు పి.జగన్ శనివారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లమ్మపేట శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పాటు శ్మశానవాటికలో నీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశానవాటికకు రోడ్డు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాలని, మొక్కలు నాటాలని, పరిశుభ్రం చేయాలని కోరారు. .

ఘనంగా మదర్ థెరీసా జయంతి

బొబ్బిలి: పట్టణంలో ఆదర్శ సేవమూర్తి మథర్ థెరిస్సా జయంతి శనివారం ఘనంగా జరిగింది. ఆర్‌సిఎం పాఠశాలలో ఉన్న మథర్ థెరిస్సా విగ్రహానికి రెల్లి ఉపకు లాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.విజయ కుమార్, వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు పూలమా లలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, యువజన నాయకులు ఎం.శ్రీనివాసరావు మథర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లోకేష్‌పై పలుచోట్ల ఫిర్యాదులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని జిల్లా వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ మామిడి శంకరరావు ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ నారా లోకేష్ పాదయాత్రలో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ పోలీస్ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా, శాంతి భద్రతలకి విఘాతం కలిగించేలా, రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా ప్రసంగిస్తున్నారన్నారు. అందులో భాగంగా తంబళ్లపల్లి పులగునున్, మాచర్ల లాంటి సెన్సిటివ్ నియోజకవర్గాలలో గొడవలు చేస్తున్నారని, రానున్న రోజుల్లో ఇది ఇంకా ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది కాబట్టి దయచేసి ఈ ఫిర్యాదును పరిగణలోకి తీసుకొని నారా లోకేష్, చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యకుడు అచ్చంనాయుడులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డెంకాడ: చంద్రబాబు, లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి కార్యకర్తలన్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని భోగాపురం, డెంకాడ మండలాల్లో వైసిపి సోషల్ మీడియా విభాగం సభ్యులు శనివారం భోగాపురంలో ఎఎస్‌కు, డెంకాడలో ఎస్ఐ మహేష్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ బాకీ వెంకటకనకరావు భోగాపురం మండల సోషల్ మీడియా కన్వీనర్ శీరపు వంశీ రెడ్డి, కో-కన్వీనర్లు అవ్వ సూర్యనారాయణ, నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ కోరాడ అప్పన్న, డెంకాడ మండల సోషల్ మీడియా కన్వీనర్ పాల్గొన్నారు.

డెంకాడ: ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

చీపురుపల్లి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడు తగు చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ ప్రభాత్ కుమార్, చీపురుపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్, కో కన్వీనర్లు గురాన జనార్దన్, పేకాపు ప్రసాద్, బైరెడ్డి కామేష్, రామలింగపురం సచివాలయ సోషల్ మీడియా కన్వీనర్ రౌతు భాస్కర్ చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి- రేగిడి

ఓటరు జాబితాలో ఎఫ్7 ద్వారా తొలగించిన ఓటర్లను మెప్మా పీడీ బి.సుధాకర్రావు పరిశీలించారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్ల జాబితాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ వారీగా బిఎల్వోలు తొలగించిన ఓటర్ జాబితా ను క్షుణ్ణంగా పరిశీలించారు. 2022లో ఎఫ్7 ద్వారా తొలగించిన ఓటర్లను పోలింగ్ స్టేషన్ల వారీగా తయారు చేసిన ఫైల్ జాబితాను తనిఖీ చేశారు. ఆర్. ఆముదాలవలస సచివాలయంలో బూత్ లెవెల్ అధికారులు తొలగించిన ఓటర్లు వివరాలను తీసుకొని తయారు చేసిన రిజిస్టర్‌తో సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. తప్పు, ఒప్పులు, ఫోటోలు మార్పిడి వంటివి గడువు లోగా సరి చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో నిష్పక్షపాతంగా వ్యవహరించి రాజకీయ పార్టీల ద్వారా ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈయనతో పాటు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

ఆముదాలవలస బిఎల్ఒతో మాట్లాడుతున్న పీడీ సుధాకర్

29న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ, విజయనగరం ఎపిఎస్ఎస్‌డిసి సంయుక్తంగా కాలేజీలో ఈ నెల 29న ఉదయం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శనివారం జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో ఐ.టి, మ్యానుఫ్యాక్చరింగ్, ఫార్మా, బ్యాంకింగ్, ఆటోమొబైల్ తదితర రంగాలకు సంబంధించి టెక్ మహేంద్ర, వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రయివేటు లిమిటెడ్, ఐసిఐసిఐ బ్యాంక్, హెటరో డ్రగ్స్, జయభేరి ఆటోమోటివ్ ప్రయివేటు లిమిటెడ్, సైనప్టిక్స్ లాబ్స్ అల్ట్రాటెక్ సిమ్మెంట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ వంటి వివిధ 16 కంపెనీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. చీపురుపల్లి, గరివిడి, మెరక ముడిదాం, గుర్ల, నెల్లిమర్ల, విజయనగరం, రాజాం, లావేరు తదితర పరిసర ప్రాంతాల్లో ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటిఐ, డిప్లొమా, బిటెక్, ఎంటెక్, ఎంబిఏ, ఎంసిఏ, ఫార్మసీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 6300495265,8886287495 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ బి. వెంకటరమణ, ఎ.ఓ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

నేటి నుంచి పవన్ జన్మదిన వారోత్సవాలు

ప్రజాశక్తి - గజపతినగరం

సెప్టెంబర్ 2న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజున పురస్కరించుకొని ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 2 వరకూ వారోత్సవాలను నిర్వహించనున్నామని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మర్రాపు సురేష్ అన్నారు. వారోత్సవాల కార్యాచరణపై శనివారం ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, మెగా అభిమానులు అందరూ వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ప్రతిరోజు ఒక కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. మొదటి రోజు మొక్కలు నాటే కార్యక్రమం, రెండువ రోజు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టు, పండ్లు పంపిణీ, మూడవరోజు మెగా రక్తదాన శిబిరం, నాలుగో రోజు అన్నదానం కార్యక్రమం, ఐదవ రోజు పాతబగ్గాం గ్రామంలో మెగా వైద్య శిబిరం, ఆరవ రోజు సర్వమత ప్రార్థనలు, ఏడవ రోజు జన్మదిన మెగా బైక్ ర్యాలీ, కేక్ కటింగ్, ఊరేగింపుతో పుట్టిన రోజు వేడుకలు, తరువాత మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఉంటుందని అన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, గజపతినగరం నియోజకవర్గం నాయకులు, పాల్గొన్నారు.

బొబ్బిలి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి బొబ్బిలి జనసైనికుల నిలయం (మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా) వద్ద తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు తెలిపారు. బొబ్బిలిలో నిర్వహిస్తున్న ఇలాంటి మంచి సేవా కార్యక్రమంలో అభిమానులు, జన సైనికులు, ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని కోరారు.

గజపతినగరం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

సమరభేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరగనున్న సిపిఎం సమరభేరిను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. సమరభేరి గోడపత్రికలను శనివారం సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో రోజురోజుకు నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, విద్యుత్ చార్జీలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30,31న ప్రజల నుంచి సంతకాలు సేకరణ, సెప్టెంబర్ ఒకటిన సచివలయాలు వద్ద విద్యుత్ బిల్లులు దగ్ధం, 2న నిరుద్యోగ సమస్యపై పట్టణ, గ్రామాల్లో ప్రచారం, 3న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం, 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వెల్లడించారు. సమర భేరిను జయప్రదం చేయాలని ప్రజలు, యువతను కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సభ్యులు బి.యుగంధర్, బి.వెంకటరమణ, కె.కృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పంటల యాజమాన్యంపై శిక్షణ

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడి ఎం. శ్యాంసుందర్

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

ప్రతి రైతు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి యం. శ్యాం సుందర్ అన్నారు. శనివారం అలజంగి, మెట్ట వలస గ్రామాల్లో వరిలో సమగ్ర పంటల యాజమాన్య విధానాలపై ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటలో విత్తనం నుంచి కోత కోసే వరకు వివిధ ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ప్రధానంగా విత్తనం శుద్ధి చేయడం సుడోమనాస్తో ఆరోగ్యవంతమైన నారు పెంచడం సమతుల్యంగా ప్రధాన పొలాన్ని తయారు చేసుకోవడం సమగ్ర యాజమాన్య విధానాలపై సూచనలు పాటించడం సమగ్ర ఎరువుల యజమానితో పాటుగా సమగ్ర పురుగుమందులు కలుపు యజమాన్యంపై రైతులకు సవివరంగా తెలియ జేశారు. భాస్రం ఎరువులు కేవలం దుక్కి లేదా దమ్ములో మాత్రమే వేయాలన్నారు. యూరియా ఎకరానికి 90 కేజీలు మూడు విడతలుగా వేసుకోవాలని, పటాస్ ఎకరానికి 40 కేజీలు రెండు తపాలుగా వేసుకోవాలని సూచించారు. పురుగు మందులు ఎరువులు వాడకుండా అవసరం మేరకు మాత్రమే మొదటిగా వేప నూనె తో స్టార్ట్ చేసి పురుగులను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి రాజశేఖర్, పెంట లత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శృంగవరపుకోట: గడ్డిమందు తాగి వనిబురి శ్రీనివాసరావు (45) అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ తారకేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన వనిబురి శ్రీనివాసరావు మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం పాడవుతుందని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని భార్య మందలించడంతో మద్యం మత్తులో శనివారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం విశాఖ కే జి హెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జనరల్ నోటీసు
IN THE HONOURABLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
SOP.No.09/2023

Between:
Divipala Veeresalingam ......Petitioner
SBI, Pradeep Nagar Branch, Vizianagaram rep. by its Manager ......Respondent

పై కేసులో Mutual Fund Folio నెం.29305580 తే.08/03/2022 దిన యొక్క సొమ్ముల విషయమై సదరు Mutual Fund యజమానియైన గరికపాటి వెంకట మహాలక్ష్మి గారు మరణించగా ఆమె భర్త దివిపాల వీరేశలింగం గారు వారసత్వపు సర్టిఫికేటు కోరుచు పై కోర్టులో పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసినారు. సదరు వారసత్వపు సర్టిఫికేటు శ్రీ కోర్టు వారు జారీ చేయుటకు ఎవరికైనను ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టులో **తే.20/09/2023**దిన ఖుద్దునకు గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మనవి చేసుకొనవచ్చును. ఎట్టి అభ్యంతరములు రాని యడల శ్రీ కోర్టు వారు తదుపరి చర్యలు తీసుకొనగలరు.

ధవళ వెంకటరావు,
పోలుబోతు జయ కృష్ణ,
అడ్వకేట్స్, విజయనగరం
Cell: 9440194894

జనరల్ నోటీసు
IN THE HONOURABLE COURT OF THE PRL, SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
E.P. No. 131/2017 IN O.S.No.228/2015

Between:
V.Dayananda Raju ....DHR
Kolla Sattayya Gupta ....JDR
To
Kolla Sattayya Gupta, S/o.Appala Bangaru Samba Siva Rao, aged about 50 years, Hindu, Business, R/o. D.No.4-49/1, Market Road, Diguva Veedhi, Gajapathinagaram of Vizianagaram dist.,

Please take notice in the above numbered EP that was filed under Order. XXI R.54 of CPC seeking attachment of the petition schedule property is stands posted to 25/09/2023 for hearing. Therefore you are hereby called upon to appear either in person or through an Advocate on 25/09/2023 by 10:30AM, else the matter will be heard ex- parte

Dhavala Venkata Rao &
Jaya Krishna Polubothu
Advocates,
Cantonment, Vizianagaram,
Cell: 9440194894

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
HMOP 111/2022

Between: **Sri.Velduti Yernaidu,** S/o.Mutyalu, Hindu, aged 28 years, SC Colony, Lotlapalli village, Jami Mandal,Vizianagaram District. --Petitioner
And: **Smt. Malicherla Pavani,** W/o.Velduti Yernaidu, Aged 19 years, resident of Nagojipet, Near Lord Kitchner Municipal School, Idea Showroom lane, Mayuri Junction, Vizianagaram. --Respondent

To,
Respondent:-
Smt.Malicherla Pavani, W/o.Velduti Yernaidu, Aged 19 years, resident of Nagojipet, Near Lord Kitchner Municipal School, Idea Showroom lane, Mayuri Junction, Vizianagaram.

NOTICE

Please take notice that the above HMOP.111/2022 filed by the Petitioner against the respondent for dissolution of marriage dated 10-02-2019 between the petitioner and the respondent. The above case is stands posted to **13-09-2023** for your appearance. You appear in person or through an Advocate before the Hon'ble Senior Civil Judge Court, Vizianagaram at **10.30 A.M,** failing which, the matter will be decided exparte in your absence.
(by order of the Hon'ble Court)

SMT. S.M. KAKSHAYANI
ADVOCATE,
D.No.24-50/2, East Point Colony Srinivas Nagar 3rd Line, VISAKHAPATNAM - 530028.
Cell No. 7799172596.

IN THE HONOURABLE COURT OF THE IST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P. 529/2019 IN A.R.C.575/2014

BETWEEN:
M/s Shriram City Union finance ltd having its Registered office at 111, Angappa Naiken Street Chennai and having its Administrative office At No.3-6-478, 4th floor, Anand Estates, Liberty road, Himayath Nagar, Hyderabad, having its branch Office at Srikakulam represented by its GPA Sri. K.V.Ramana, Now Represented by its GPA Holder Sri. K.Vasu ..Decree Holder.
AND
Potnuru Srinivasa Rao & Another ..Judgment Debtor
R1. Potnuru Srinivasa Rao, S/o Malleswara Rao, R/o D.No.10-20, Kondaka Street, Rajam, Srikakulam District - 532127.
R2. Potnuru Satyavathi,W/o Srinivasa Rao, R/o D.No.10-20, Kondapaka Street, Rajam, Srikakulam District - 532127

వేలం ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 11-09-2023 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

వేలం ఆస్థి వివరములు :
Srikakulam District, Rajam Sub-Registry, Rajam mandalam, Rajam village and Panchayat, southern side of Kondaka Street, RCC building consisting of ground and 1st floors bearing D.Nos. 1-20 & 10-21, Panchayat assessment No.1256, ward No.10, covered by S.No.109, measuring from East to West 15 feet 8 inches and North to South 86 feet total extent 152 Sq.yards, ground floor with plinth area of 553.42 Sq.feet & 1st floor 553.42 Sq.feet bounded by: **East:** Thatched house with back yard and front yard of Bore Rudrayya **South:** Immovable property of Balla Gumpa Swamy **West :** Tiled house and back yard of Y.Subba Lakshmi, **North:** Kondaka Veedhi Union Road and Canal. **DHR value : 30,00,000/-**
Amine Value : 40,00,000/-
Hearing date : 11-09-2023
Further Hearing date : 18-09-2023

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Phone No : 9849178948, 9704986271, 9866509590, 9849824246